పత్రికాప్రకటన కాకినాడ, 17.3.2019

ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన పోలింగ్ ప్రక్రియను ప్రిసైడింగ్ అధికారులు అవగాహన, జాగురూకలతో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా కోరారు.

ఆదివారం స్థానిక పి.ఆర్.ప్రభుత్వ కళాశాల ఆవరణలో కాకినాడ పార్లమెంట్, కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజక వర్గాల ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులకు ఎన్నికల నిర్వహణ అంశాలపై తొలివిడత శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా హాజరై పిఓలు, ఏపిఓలకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునే పోలింగ్ ప్రక్రియ అతి ముఖ్య మైనదని, ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాల్సిన గురుతర బాధ్యత పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులదే నని తెలిపారు. గతంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో పోలింగ్ నిర్వహించిన అనుభవం ప్రిసైడింగ్ అధికారులకు ఉన్నప్పటికీ, ఈ విడత ఎన్నికలలో క్రొత్తగా వివిపాట్ యంత్రాలను వినియోగిస్తున్నందున, బాలెటింగ్, కంట్రోల్ యూనిట్లకు వివిపాట్‌లను సరైన రీతిలో జోడించే విధానం గురించి సమగ్ర అవగహన పొందాలని సూచించారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది అవగాహన కొరకు ఓటింగ్ యంత్రాలను అన్ని తహసిల్దారు కార్యాలయాలలో ఉంచుతున్నామని, పిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఏవైనా సందేహాలు ఉంటే వాటిపై నివృత్తి చేసుకోవచ్చునని తెలిపారు. అలాగే ఈ నెల 30 లేదా 31 తేదీలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు మరో విడత శిక్షణ నిర్వహించనున్నామని తెలియజేశారు. పోలింగ్ రోజు సకాలంలో ఓటింగ్ యంత్రాలను సిద్దం చేసి ముందుగా మాక్‌పోల్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, మాక్‌పోల్ డేటాను క్లియర్ చేసిన అనంతరం పోలింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. అలాగే ఓటింగ్ ముగిసిన పిదప సక్రమంగా పోల్ క్లోజింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్‌కు సంబంధించిన అంశాలను ప్రిసైడింగ్ అధికారుల డైరీలో విధిగా నమోదు చేసి, ఫారమ్-17సి బ్యాలెట్ అకౌంట్, పేపర్ సీల్ అకౌంట్లులతో పాటు రిసెప్షన్ కేంద్రంలో సమర్పించాలని తెలిపారు. అలాగే ప్రిసైడింగ్ అధికారులు నింప వలసిన ఫారమ్‌లన్నిటినీ పోలింగ్ ముగిసిన వెంటనే సక్రమంగా పూర్తి చేసి సిద్దం చేసుకుంటే, రిసెప్షన్ కేంద్రంలో ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం రాదన్నారు. పోలింగ్ ముందు రోజు ఉదయం 7 గం.లలోపే డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకుని తమకు కేటాయించిన పోలింగ్ యంత్రాలు, మెటీరియల్ సేకరించుకోవాలని, అల్పాహారం అందించి 10 గం.ల నుండి రూట్‌ల వారీ బస్సులలో వారివారి పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలలోనే పోలింగ్ పార్టీలు బస చేయాలని, వారికి భోజనం, ఇతర కనీస వసతులు అక్కడ కల్పిస్తామన్నారు. ప్రిసైడింగ్ అధికారుల తప్పిదాల వల్ల రిపోలింగ్ చేయవలసి వస్తే ఓటర్లు, ఎన్నికల యంత్రాంగం సుమారు 3 వేల మందికి ఇబ్బంది, లక్షలాది ప్రజాధన నష్టం కలుగుతాయని, అటువంటి పరిస్థితి రాకుండా అత్యంత జాగురూకతతో పోలింగ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో కాకినాడ ఆర్‌డిఓ జి.రాజకుమారి, అడిషనల్ కమీషనర్ నాగ నర్సింహారావు, అర్బన్ తహశిల్దారు సిహెచ్‌ఎస్వీఎస్ఎల్ఆర్ ప్రసాద్, కెఆర్‌సి తహశిల్దారు నాగలక్ష్మమ్మ, 975 మంది పిఓలు, ఏపిఓలు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

(ఎన్నికల మీడియా సమాచార కేంద్రం, కలెక్టరేట్)